కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు కిలో రూపాయాలు... టమోటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.38, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.17, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.40, మునగ రూ.23, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.13, కీర రూ.18, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.35లుగా ఉన్నాయి.

పెళ్లి చేసుకుంటానని మోసం

సైదాబాద్‌లో యువకుడి అరెస్ట్

సైదాబాద్: పెళ్లి చేసుకుంటానని యువతికి మాయమాటలు చెప్పి మోసం చేసిన యువకుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాతబస్తీకి చెందిన హర్షకుమార్ (24), సైదాబాద్‌లో నివసించే యువతి పాఠశాల స్థాయి నుంచే స్నేహితులు. ఇటీవల అతడు యువతిని ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. తీరా పెళ్లి చేసుకుందామని యువతి అడిగితే చేసుకోనని చెప్పాడు. దీంతో యువతి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బుధవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అన్ని మతాల సారాంశం ఒకటే..



ఇఫ్తార్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సుజాతనాయక్, ముస్లిం మతపెద్దలు

హస్తినాపురం: అన్నిమతాల సారాంశం ఒకటేనని మత సామరస్యంతో పండుగలు జరుపుకోవాలని తమ మతాన్ని గౌరవిస్తూ ఇతర మతాల పట్ల ప్రేమతో మెలగాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. భూపేశ్‌గుప్తానగర్ కాలనీలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, షాకీర్, మమత మల్లేశ్‌గౌడ్, కార్తీక్, సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-ఖదర్

చార్మినార్: ముస్లిం సోదరులు షబ్-ఏ-ఖదర్ వేడుకలను గురువారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రంజాన్ మాసంలో ఎంతో విలువైన రాత్రిగా భావించి రాత్రంగా జాగరణ చేశారు. గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందులు ముగించుకున్న ముస్లింలు ఈ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. రాత్రంతా జాగరణ చేస్తూ పవిత్ర ఖురాన్ పఠనం చేశారు. మక్కా మసీదులో ముస్లింలు రాత్రి 8 గంటలకు ఇషా నమాజ్ నిర్వహించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఖురాన్‌లోని ముఖ్యమైన ఘట్టాలను చదివి వినిపించారు. రంజాన్ మాసంలో ఆకాశ (స్వర్గ) ద్వారాలు తెరుచుకుంటాయని ప్రతీతి. ఉపవాస దినాల్లోని షబ్-ఏ-ఖధర్ (విలువైన రాత్రి)గా విశ్వసిస్తారు. అందుకే రాత్రిపూట జాగరణ చేస్తూ మసీదులలో ఎక్కువగా గడపడానికి ఇష్టపడుతారు. ఈ విలువైన (షబ్-ఏ-ఖదర్) రాత్రి ఎవరైతే దైవం వైపునకు మరలి ఆయన ఆరాధనలో సంపూర్ణంగా లీనమవుతారో వారు గొప్ప శుభాలు పొందినవారవుతారని ముస్లింల ప్రగాఢ నమ్మకం.

నేడు అల్విదా జుమ్మా సామూహిక ప్రార్థనలు

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో శుక్రవారం జుమాత్-ఉల్-విదా సందర్భంగా సామూహిక ప్రార్థనలు (నమాజ్-టీ-జుమ్మా) నిర్వహించిన అనంతరం మక్కా మసీదులో 'జల్సా యముశ్ యోముల్-ఖురాన్' సభను ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సామూహిక ప్రార్థనల్లో మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ పాల్గొని ప్రత్యేక ప్రసంగం చేస్తారన్నారు. ఈ సందర్భంగా మజ్లిస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, మౌలానా సయ్యద్ జహీర్ ఉద్దీన్ అలీ సూఫీ ఖాద్రీ సాహబ్ కూడా ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫేకర్ అలీ హాజరు కానున్నారని తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ వేడుకలు

అఫ్జల్‌గంజ్: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ వేడుకలు దోహదపడుతాయని బేగంబజార్ డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి కోళ్ల ప్రదీప్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం మైనార్టీ నాయకులు వహీద్‌ఖాన్, మహ్మద్ రవూఫ్, ఇమ్రాన్‌ఖాన్, ఫిరోజ్‌ఖాన్, ఎజాజ్‌ఖాన్, మహ్మద్ సల్మాన్‌ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రదీప్ రాజ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎంతో పటిష్టంగా ఉందన్నారు. అన్నివర్గాల ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. ఈ కార్యక్రమంలో శివశంకర్ శర్మ, విష్ణువర్ధన్, శివరామ్ పాల్గొన్నారు.

శిక్షణ.. ఉపాధి.!

- కుట్టు శిక్షణలో మహిళలకు తర్ఫీదు ఇస్తున్న నూర్ హింద్ సంస్థ
- మలక్‌పేట నియోజకవర్గంలో 11 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు
- ఇప్పటి వరకు శిక్షణ పూర్తి చేసుకున్న 3వేల మంది మహిళలు
- మహిళలకు పీస్ వర్క్ కింద ఉపాధి కల్పిస్తున్న నిర్వాహకులు



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, యువతులు



సలీంనగర్ శిక్షణ కేంద్రంలో కుట్టు మెషిన్ నేర్చుకుంటున్న మహిళలు



మహిళలకు సర్టిఫికెట్లు, కుట్టు మెషిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి మలక్‌పేటలో 'నూర్ హింద్‌'సంస్థ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 2016 నుంచి మహిళలు, యవతుల నుంచి విశేష స్పందన వస్తోంది. మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి చేయూతగా నిలబడాలనే ఉద్దేశంతో స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాల సహాయ సహకారంతో కుట్టు శిక్షణ కేంద్రాలు నడుస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలోని ఆరు డివిజన్లలో సలీంనగర్, మూసారంబాగ్, ఓల్డ్ మలక్‌పేట, శంకర్‌నగర్, పద్మానగర్, చంచల్‌గూడ, గడ్డిబౌలి, సైదాబాద్ శంకేశ్వర్‌బజార్, హరిజన బస్తీ, అక్బర్‌బాగ్ దిల్‌ఖుషా ఫంక్షన్‌హాల్, కాలాడేరా ప్రాంతాలలో మూడు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున 30 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నారు. ఒక్కొక్క శిక్షణ కేంద్రానికి ఒక్కొక్క ట్రైనర్, ఇన్‌చార్జిని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 3000 మంది మహిళలు శిక్షణ పొంది జీవనోపాధి పొందుతున్నారు.

మెళకువలు, బ్యూటీషియన్‌లో కూడా...

కుట్టు శిక్షణలో మెళకువలు, రోజు ఆరు గంటలు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జాబ్ వర్క్ చూపిస్తున్నారు. అందుకే మహిళలు కుట్టు మెషిన్ నేర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. బ్యూటీషియన్‌లో కూడా తర్ఫీదు ఇస్తున్నారు. హెవీ మెషిన్ ద్వారా జూకీ ఆపరేటర్, జన శిక్షణ్ సంస్థాన్ (జేఎస్‌ఎస్) ద్వారా అల్లికలు, జ్యూట్ బ్యాగుల తయారీ, చేతి పనుల్లో ప్రత్యేకంగా నేర్పిస్తున్నారు.

వివిధ రకాల డివిజన్లలో ప్రత్యేక శిక్షణ..

◆ మూడు నెలల కాలంలో మహిళలకు రకరకాల డిజైన్లలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా డిజైన్ జాకెట్లు, పంజాబీ డ్రెస్సులు, స్కర్ట్స్ నైటీస్, యాప్రాన్, నిక్కర్ మేకింగ్‌లో శిక్షణ పొందున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు స్కిల్ ఇండియా డెవలప్‌మెంట్‌లో సభ్యత్వం ఇప్పించి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. తెలంగాణ గార్మెంట్ మ్యానిఫ్యాక్చర్ అసోసియేషన్ ద్వారా వారికి జాబ్ వర్క్ ఇప్పిస్తూ ఉపాధి కల్పిసున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళల్లో చాలా మంది ఉపాధి పొందుతున్నారు. శిక్షణకోసం వచ్చే మహిళలకు అవసరమైన క్లాత్, పేపర్, దారం, తదితర మెటీరియల్‌ను సమకూర్చుకోవడానికి ఎమ్మెల్యే సహకారం అందిస్తున్నారు.

మహిళలు ఆసక్తి చూపుతున్నారు



నేర్చుకోవాలనే కుతూహలం ప్రతీ ఒక్కరిలో ఉంది. కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలబడటానికి కుట్టు శిక్షణ పట్ల మహిళలు బాగా ఆసక్తి చూపుతున్నారు. రోజుకు 30మంది శిక్షణకు వస్తున్నారు. ట్రైనింగ్ తరువాత వారికి పీస్ వర్క్ ఇచ్చి పని కల్పిస్తున్నాం. ఎమ్మెల్యే బలాల మహిళలు ఆర్థికంగా ఎదగడానికి చేస్తున్న కృషి మరువలేం.

– సృజనా, మూసారంబాగ్, ట్రైనర్

ఎమ్మెల్యే బలాల సహకారంతోనే..



మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సహకారంతోనే కుట్టు శిక్షణ కేంద్రాలు నడుస్తున్నాయి. కుట్టు మెషిన్లు, మెటీరియల్, శిక్షణ ఇచ్చే వారికి వేతనం ఎమ్మెల్యే భరిస్తారు. ఎమ్మెల్యే సూచన మేరకు మహిళకు అక్షర జ్యోతి ప్రోగ్రామ్ కూడా నిర్వహిస్తున్నాం. ఇంకా కొత్తగా ఆరు సెంటర్లు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

– నజీమా షరీఫ్, నూర్ హింద్ సంస్థ ప్రెసిడెంట్

ఎల్బీనగర్ నియోజకవర్గానికి అయోధ్య ధనుర్బాణం



శారదానగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్బాణానికి పూజలు చేస్తున్న అర్చకులు

వనస్థలిపురం: అయోధ్యలో శ్రీరామచంద్రుడికి సమర్పించడానికి బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో తయారు చేయించబడిన ధనుర్బాణం గురువారం ఎల్బీనగర్ నియోజకవర్గానికి చేరుకుంది. వనస్థలిపురం శారదానగర్‌లోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా నూకల ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ధనుర్బాణాన్ని ఇక్కడి నుంచి విజయవాడ ఉండవల్లిలో ఉన్న శ్రీదశావతారాల వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చేరుకుంటుందన్నారు. వసంత నవరాత్రుల అనంతరం అయోధ్య రామాలయానికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.సిరిపురపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువ నిర్మాణంతో మురుగు సమస్యకు చెక్



శుభోదయకాలనీలో సమస్యను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో వరదనీటి కాలువ ఏర్పాటుతో మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుందని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన సర్కిల్, జలమండలి, అధికారులు, కాలనీవాసులతో కాలనీలో పాదయాత్ర చేశారు. త్వరలో ఏర్పాటు చేయనున్న వరదనీటి కాలువ, సీసీ రోడ్ల పనులు చేపట్టే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... త్వరలో కాలనీలో రూ.3.3కోట్ల నిధులతో వరదనీటి కాలువ, సీసీ రోడ్ల నిర్మాణం చేయనున్నట్లు స్పష్టం చేశారు. కాలనీలలో అభివృద్ధి పనులు జరిగే సమయంలో కాలనీవాసులకు కొంతమేర అసౌకర్యం కలుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థానికులు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, వాటర్‌వర్క్స్ అధికారులు శ్రీహరి, శ్రీనివాస్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, దశరథగౌడ్, గణేష్, పాముల మల్లేష్, శ్రీధర్‌గౌడ్, వేణుగౌడ్, కాలనీవాసులు సునీల్, శ్రీశైలం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు చీరలు, డ్రెస్ మెటీరియల్ అందజేత



దుస్తులు అందుకున్న మహిళలతో లయన్ డా. విజయరంగ, మహమ్మద్ ఇస్మాయిల్



మహిళలకు చీరలను అందజేస్తున్న కందికంటి శంకరయ్య ఫౌండేషన్ నిర్వాహకులు

నాగోలు: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం మహిళలకు లయన్ డా. విజయరంగ ఆధ్వర్యంలో చీరలు, డ్రెస్ మెటీరియల్, సూట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెయింట్ జార్జ్ స్కూల్ చైర్మన్ మహమ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ గౌడ సంఘం భవనంలో..

లింగోజిగూడ: రంజాన్ సందర్భంగా కందికంటి శంకరయ్య ఫౌండేషన్ నిర్వాహకులు కందికంటి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం సరూర్‌నగర్ గౌడ సంఘం భవనంలో 200మంది ముస్లిం మహిళలకు చీరల పంపిణీ చేశారు. లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్‌లు ముఖ్యఅతిథిలుగా పాల్గొని చీరలను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బబ్బూరి ఆనంద్‌గౌడ్, బేర బాలకిషన్, రాజు గౌడ్, గణేష్ నాయక్,మహ్మద్ ఖాజా, మహ్మద్‌గౌస్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 33మంది ఎంపిక

హస్తినాపురం: తమ విద్యాసంస్థలో చదువుకున్న విద్యార్థులందరూ ఏదో ఒక కంపెనీలో ఉద్యోగాలు సంపాదిస్తున్నారిన అనయ డిగ్రీ కళాశాల చైర్మన్ పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. వివిధ సంస్థలు 33 మంది విద్యార్థులను ఎంపిక చేసింది. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ కె.నాగమణి, వైస్ ప్రిన్సిపల్ పైదిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లికార్జునహిల్స్‌కాలనీలో రెవెన్యూ, హైడ్రా అధికారులు

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలనీ సమీపంలోని మల్లికార్జునహిల్స్ కాలనీలో గురువారం ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు, హైడ్రా అధికారులు పరిశీలించారు. మల్లికార్జునహిల్స్ కాలనీ పార్కు స్థలం ఓ బిల్డర్ కబ్జా చేసి అనుమతులు లేకుండా భారీ గోదాములు నిర్మించారని స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ, హైడ్రా అధికారులు వచ్చి సదరు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే వచ్చి కబ్జాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటమాని హెచ్చరించారు.

నేడు జుమ్మాతుల్ విదా

చార్మినార్: జుమ్మాతుల్ విదాను పురస్కరించుకొని మక్కా మసీదులో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రంజాన్ మాసంలో వచ్చే చివరి శుక్రవారాన్ని 'జుమ్మాతుల్ విదా'అంటారు. ఈ నెల 28న నిర్వహించే జుమ్మాతుల్ విదా (అల్ విదా జుమ్మా) సందర్భంగా ముస్లింలు మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ ప్రార్థనలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మక్కా మసీదు సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హజా అనంతరం 12.45 గంటలకు కుద్బా కార్యక్రమం జరుగుతుంది. 1.10 గంటలకు సామూహిక ప్రార్థనలు ప్రారంభమవుతాయి. మక్కా మసీదు కతీబ్ రిజ్వాన్ ఖురేషీ సామూహిక ప్రార్థనలు చేయించనున్నారు. మక్కా మసీదు ప్రాంగణంతో పాటు చార్మినార్, చార్‌కమాన్, గుల్జార్‌హౌజ్, లాడ్‌బజార్, సర్దార్ మహల్ తదితర రోడ్లపై శుక్రవారం ఉదయం కార్పెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే చార్మినార్-మక్కా మసీదు దారిలో ట్రాఫిక్‌కు ఎలాంటి అనుమతి లేదు. అంతేకాకుండా చార్మినార్ కట్టడం నలువైపుల వాహనాలకు నో ఎంట్రీ అమలులో ఉండడంతో ఇక శుక్రవారం జుమ్మాతుల్ విదా ప్రార్థనల సందర్భంగా ఇతర దారుల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లించనున్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

బ్యాంబు ట్రీ-పార్క్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం



వనస్థలిపురం బ్యాంబు ట్రీ పార్క్‌లో కాలనీవాసులతో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజారు సమీపంలో ఉన్న హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోని బ్యాంబు ట్రీ పార్క్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం హెచ్‌ఎండీఏ వర్క్ ఇన్‌స్పెక్టర్, పలు కాలనీవాసులతో కలసి ఆయన పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పది రోజుల్లో పార్కులో అభివృద్ధి పనులు మొదలవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు రాంరెడ్డి, సాయికిరణ్‌గౌడ్, పార్క్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వయోధికుల పోషణ, రక్షణ చట్టం గురించి తెలుసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నాగోలు: వయోధికుల పోషణ, రక్షణ చట్టం-2007 ప్రాధాన్యత గుర్తించి సీనియర్ సిటిజన్స్ అందరూ తెలుసుకోవాలని టాస్కారాష్ట్ర అధ్యక్షుడు బి.నరసింహరావు అన్నారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగులు సమావేశం, టాస్కా మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గురువారం నాగోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ... ప్రభుత్వాలు వయోధికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నామని అన్నారు. వయోధికులు తమ హక్కులపై గళమెత్తాలని కోరారు. వేణుమాధవ్ మాట్లాడుతూ... వయోధికులకు ఉచిత బస్సు సౌకర్యం, కల్పించాలన్నారు. ఉచిత న్యాయ సలహా విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలోని ఓల్డ్ ఏజ్ హోమ్ లలో ఉన్న వయోధికుల స్థితిగతులపై సమీక్ష జరపాలన్నారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులు, ఇతర రంగ పెన్షనర్స్ సమస్యల పట్ల ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి పీఎస్ఎన్ చౌదరి, ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు తోట రంగయ్య, సంయుక్త కార్యదర్శి గీస కనకయ్య, కొట్టే మల్లయ్య, ఎం.రాజా నర్సు, చుక్కల నర్సయ్య, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, రాజు, జి.వి.రాజిరెడ్డి తదితర సింగరేణి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ సదనంలో ఉగాది పంచాంగం ఆవిష్కరణ

- హాజరైన త్రిదండి అహోబిల, దేవనాథ జీయర్ స్వాములు



పంచాంగం ఆవిష్కరిస్తున్న త్రిదండి అహోబిల, దేవనాథ రామానుజ జీయర్ స్వాములు, నిర్వాహకులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో శ్రీవైష్ణవ సేవా సంఘం, ఎస్వీఎస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి ముఖ్యఅతిథులుగా హాజరై నూతన సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఉభవ వేదాంత పండితులు నేపాల్ కృష్ణమాచార్యస్వామి, వేద పండితులు భట్టర్ సుకుమారాచార్యులు, పాంతచాత్ర ఆగమ పండితులు మంగళగిరి యాదగిరిస్వామి, అర్చకులు భట్టర్ సరేంద్రాచార్యులు, సంస్కృత పండితులు హనుమంచపల్లి శ్రీరంగాచార్యులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. అనంతరం శతాదిక వృద్ధరాలు శృంగారం అండమ్మను ఘనంగా సన్మానించారు. శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ అధ్యక్షుడు శృంగారం తిరువెంగలాచార్యులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారుడు డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచార్యులు, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, వీహెచ్‌పీ అధికార ప్రతినిధి రావి నూతల శశిధర్, మహిళా కార్యవర్గ సభ్యులు రమాదేవి, మాధవీలత, శ్రావణి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



మలక్‌పేట పౌర సరఫరాల కార్యాలయం

చాదర్‌ఘాట్: అర్హులందరికీ రేషన్ కార్డు జారీ చేస్తామని మలక్‌పేట సర్కిల్-1 అధికారి ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ... ప్రజాపాలన, మీ సేవ ద్వారా రేషన్‌కార్డుల కొరకు 14885 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో 5000 దరఖాస్తులు కార్యాలయంలో అందజేశారని తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు అందజేయాలని కోరారు. దీని దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ తొందరగా పూర్తవుతుందని తెలిపారు. ఈ విషయంపై రేషన్ డీలర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

మిర్చి ఘాటు ఓ పక్క.. నీటి దప్పిక మరోపక్క.!

గంజ్‌లో హమాలీ, రైతులకు ఇబ్బందులు

చాదర్‌ఘాట్: వేసవి దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ (మలక్‌పేట గంజ్)లో ఒక్కటంటే ఒక్క చలివేంద్రం ఏర్పాటు చేయలేదు. గంజ్‌కు నిత్యం వేలాది మంది వస్తుంటారు. హమాలీలు, కమీషన్ ఏజెంట్లు, చాట్ కార్మికులు, రైతులు క్రయ విక్రయాలకు వస్తారు. వీరికి దాహం వేస్తే వాటర్ బాటిల్ కొనుక్కుని తాగాల్సిన దుస్థితి నెలకొంది. గంజ్‌లో 'మిర్చి ఘాటు ఓ పక్క.. నీటి దప్పిక మరోపక్క'కనిపిస్తోంది. అయినా మార్కెట్ పాలకవర్గం స్పందించకపోవడం గమనార్హం.



యూపీహెచ్‌సీ సెంటర్లకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు



చాదర్‌ఘాట్: అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు వేసవి నేపథ్యంలో ఆరోగ్యశాఖ అధికారులు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పెద్దఎత్తున దాదాపు 10వేల ప్యాకెట్లు సరఫరా చేసారని యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ తరుణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో చిన్నపిల్లలు, పెద్దవారు డీహైడ్రేడ్ అవటానికి అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వారి కోసం ఈ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కాలనీవాసులు వచ్చి ఈ ప్యాకెట్లు తీసుకెళ్లొచ్చని చెప్పారు. అదే విధంగా జింక్ సల్ఫేట్ 20ఎంజీని కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' కోసం డబ్బుల వసూల్.!

చంచల్‌గూడ: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుంటే మరో పక్క చోటామోటా నాయకులు పేదల బలహీనతను ఆసరాగా చేసుకుని డబ్బులు దండుకుంటున్నారు. యాకుత్‌పురా, మలక్‌పేట నియోజకవర్గాల్లో పేదలు డబుల్ బెడ్ రూమ్‌ల కోసం చోటామోటా నాయకులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా రూ. లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేశారు. నేరంలో ఇరుక్కోకుండా బ్రోకర్లు తెలివిగా నగదు రూపంలో డబ్బులు తీసుకున్నారు. లాటరీలో మీ పేరు రాలేదని డబ్బులు తిరిగి రావని తేల్చేసి చెబుతున్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తే వందల సంఖ్యలో బాధితులు ముందుకొచ్చే అవకాశముంది.



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDEGE, RANGA REDDY DISTRICT, AT L. B. NAGAR

G.W.O.P. NO.17 OF 2025

Between:
Sriperambudur Rajesh Kumar ...Petitioner
AND
All Concerned ...Respondent
To
ALL CONCERNED

The general public hereby take notice that petitioner filed petition U/s.29 of Hindu minority and guardianship act of 1956 to seeking permission from the above mentioned Hon'ble court to sell minor's property i.e., Notice schedule Property, Wife of the Petitioner and mother of two children i.e. Late Vijamara Srilatha Devi was died intestate on 31-05-2022, leaving behind the petitioner and two children as her legal heirs, Petitioner is intending to sell the said property to prospective purchasers. Who ever having any objections or claims over the said issue may appear before the above said court on 02/04/2025 At 10.30 A.M. either in person or through an Advocate, otherwise the matter will be decided according to law treated that no objections received.

NOTICE PETIITON SCHEDULE PROPERTY

All that the House bearing No.3-408/2 (PTI No. 1195002373), On Plot No.135, in Survey Nos.16 and 18, admeasuring 120 Square yards or 100.33 Square meters, having Plinth area of 725 Square feet with R.C.C., roof, Situated at Blok No.5, R.N.Reddy Nagar, Meerpet Village, Balapur Mandal, Ranga Reddy District. Under the Meerpet Municipal Corporation and bounded as under.
North: Plot No.136, South Plot No.134, East 25'-0" Wide Road, West: Plot No.102

//BY ORDER OF COURT//
M/S.KOTLA SUDHAKAR
Advocate and Associates
Flat No.F1, Kamala Nivas, Kamala Nagar, Gaddiannaram, Saroornagar, Hyderabad-500079.
Cell: 9390626508, Mail id: advkotla@gmail.com